# ★ నా ఉపవాస దీక్ష ★

శిష్టా వెంకటసుబ్బలక్ష్మి

(వయస్సు 14 సం॥ లు)

అవి నా చిన్నతనపు రోజులు.

స్కూలులో చదువు ప్రారంభమైనది. మేము కొంతమంది పిల్లలము జట్టుగా ఉండేవాళ్లం. వాళ్లలో ముఖ్యులు హారిణి, పద్మ, లలిత. మా క్లాసు మొత్తంమీద నేను, లలిత చాలా దగ్గరబంధువుల్లాగా అంటే స్వంత అక్కచెల్లెళ్లలాగా మెలిగేవాళ్లం. మిగిలిన హారిణి, పద్మ మాకంటె ఒక క్లాసు తక్కువ. అయినా మేము ఇద్దరం వాళ్లతో కలవక మానేవాళ్లం కాదు. విశ్రాంతి సమయాల్లో మేము నలుగురం కలిసి ఆడుకునేవాళ్ళం.

ఇంక నాకు ఇంటిదగ్గర ఒక జట్టుండేది. వాళ్లలో ముఖ్యులు శేషమాంబ, సీత, లక్ష్మి. వీళ్లందరికీ మా ఇల్లు ఒక జంక్షను లాగా ఉండేది. ప్రతి శని, ఆది వారాల్లో మేమందరము మా ఇంట్లోనే కలుసుకునేవాళ్లం. ఇతర రోజుల్లో స్కూలుంటుంది కనుక మాకు ఆటలాడుకునేందుకు పడేది కాదు. మేము వేసవి, డిశెంబరు సెలవుల్లో మా ఇంట్లోనే నాటకాలు వేసేవాళ్లం.

ఆరోజు తొలి ఏకాదశి. నేనేం చేశానంటే మా అమ్మతో పోట్లాడి ఉపవాసం ఉంటానన్నాను. మా అమ్మ "వద్దు. ను వ్వుండలేవు" అంది. అయినా నే నుండగల నన్నాను. "సరే. చెప్తే వినకపోతే నేనేం చేస్తాను ఉండ"మంది. ఇంక అప్పుడు నేను హార్మోనియంతీసి పాటలు పాడటం మొదలుపెట్టాను. అంటే అది దేవుడిమీద భక్తి అన్నమాట. మెల్లిగా వన్నెండు గంటలవరకు ఉండగలిగాను. కాని ఆ తరువాత బాగా ఆకలైంది. ఏం చేస్తాను. అమ్మ చెప్పిన మాట విన లేదు. అమ్మ అప్పటివరకూ చెబుతూనేవుంది అన్నం తినమని. మనస్సులో తినాలని ఉన్నా అందరూ నవ్వుతారేమోనని నేను తిన నన్నాను. సరే. నీ ఖర్మం అని ఊరుకుంది. ఇంక అప్పటినించి అంటే



బోనులో పులి —వీటూరి ప్రకాశం, 7 సం॥ లు మద్రాసు.

చూసి నవ్వడం మొదలుపెట్టారు. ఎందుకు నవ్వుకుంటున్నారో అని అనుకున్నాను. కొంతసేపయాక మా తమ్ముణ్ణి పిలిచి తమ నవ్వుకు కారణ మేమిటో అడిగాను. వాడు, నేనలా వంటింట్లోంచి వసారాలోకి, వసారాలోంచి వంటింట్లోకి తిరగడం చూచి నవ్వా మన్నాడు. నాకు కోపం వచ్చింది. ఇంక ఒక మూలకి వెళ్ళి మూతి ముడుచు కూర్చున్నాను.

సాయంత్రమయేసరికి కడుపులో మంట ఎక్కువైంది. పైగా ఆ రోజు మంచి పిండివంటలు చేశారు. వాటి వాసనలు పీల్చేసరికి ఉపవాసం ఎందుకు ఉన్నానా అనిపించింది. మా అమ్మదగ్గరకువెళ్లి నేను రాత్రయేసరికి భోజనం చేస్తానన్నాను. మా అమ్మావాళ్లు ఇంకా ఎక్కువగా నవ్వడం మొదలు పెట్టారు. నవ్వితే నవ్వారని నేను మాట్లాడకండా ఊరుకున్నాను.

ఆ మర్నాడు మా అమ్మ నాకు తెలియకుండా మా ఇంటిదగ్గర ఉన్న స్నేహితులకు ఈ సంగతి చెప్పేసినట్లుంది. ఆ సాయంకాలను వాళ్లందరు నన్ను ఏడిపించటం. వీళ్ల కెలా తెలిసిందా అని అనుకున్నాను. మా అమ్మ చెప్పిందేమో అనుకున్నాను. వాళ్లలా అనేసరికి నేను ఒక ప్లాను వేశాను. వాళ్లతో అన్నాను. "మీకు మతి పోయిందా ఏమిటి? నేను ఒక్కపూట ఏమన్నా తినకపోతే ఉండలేనన్న సంగతి తెలిసే ఇల్లా అంటున్నారా? నేను ఉపవాస మున్నానని ఎవరో చెప్పటం; మీరు నమ్మటం, ఎంత బాగుందబ్బా! నేను ఒక్కపూట ఏమన్నా తినకపోతే ప్రపంచం తల్లక్రిందు కౌతుందని మీకు తెలియదూ? సాయంత్రం నేను ఇంటికొచ్చేసరికి ఏమన్నా లేకపోతే ఆరోజు ఇల్లు ఇల్లులాగా ఉంటుందా?" ఈమాటలనేసరికి వాళ్లు మరి నోరెత్తలేదు. నేను బతికాంరా బాబూ అనుకున్నాను.

మర్నాడు స్కూలుకి వెళ్లేసరికి స్కూల్లో ఉండే జట్టువాళ్లు నన్నేడిపించటం మొదలుపెట్టారు. అయ్యబాబోయ్ వీళ్ల కెలా తెలిసిందా అనుకున్నాను. వాళ్లకి సర్ది చెప్పేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. నా సంగతి వీళ్లకెలా తెలిసిందా అని ఆలోచించడం మొదలుపెట్టాను. మా ఇంటిదగ్గర ఉండే జట్టు పిల్లల్లో ఒక అమ్మాయి మా స్కూల్లో చదివేదిలెండి. ఒక వేళ ఆ అమ్మాయి చెప్పిందేమో అనుకున్నాను. ఆ రోజు యేదో ఒకలాగా గడిపేశాను.

ఆ సాయంత్రం ఇంటికెళ్ళి భోగట్టా చెయ్యగా నా ఆలోచన నిజమని తేలింది. ఆ అమ్మాయిని పట్టుకుని బాగా ఝాడించేశాను. ఇప్పటికీ ఆ అమ్మాయి నన్ను చూస్తే భయంగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఆరోజు మొదలు ఈరోజు వరకు నేను ఎప్పుడూ ఉపవాసం మాట ఆలోచించడానికి నా మెదడుకు సమయం ఇవ్వలేదు. ఎప్పుడు ఏకాదశి వచ్చినా ఆనాడు జరిగిన తతంగం జ్ఞాపకం వచ్చేది. ఇంతకీ నేను చెప్పొచ్చే దేమిటంటే మీ రెవరైనా ఉపవాసం చెయ్యదల్చుకుంటే ముందట మీ శక్తిసామర్థ్యాలు చూచుకోండి. లేకపోతే అనవసరంగా నలుగురిలో నాలాగా నవ్వులపాలవుతారు. ★

డాన్‌క్విక్ వ్
వెల రెండురూపాయలు
పోస్టుఖర్చులు ప్రత్యేకం
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1.

